క్లుప్తంగా

సకాలంలో పనులు పూర్తి చేయించాలి


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. ఆయన గురువారం పలు వార్డులలో చేపట్టిన పనులను పరిశీలించారు. దోబీఘాట్, శ్మశానవాటిక, మురుగు కాలువల నిర్మాణం తదితర పనులను పరిశీలించి పనులు సకాలంలో పూర్తి చేయించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఖలీమొద్దీన్

పెద్దశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీసీసీబీ మేనేజర్ ఖలీమొద్దీన్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'సరైన ఆరంభం- అవ్వండి ఫైనాన్షియల్ స్మార్ట్' అనే నినాదంతో సైబర్ నేరాలు, బ్యాంకులో పొదుపు ఆవశ్యకతను వివరించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ షేర్ చేయవద్దని, అవసరమైన లింక్స్ ఓపెన్ చేయకూడదని, అపరిచిత కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, పీఏసీఎస్ సీఈఓ రవీందర్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, ఆశారాణి, బ్యాంకు ఫీల్డ్ అధికారి రాజనర్సింహ తదితరులున్నారు. అనంతరం బ్యాంకు సంబంధిత ప్రశ్నోత్తరాల విభాగంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన


ఈవీఎంల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

చేగుంట(తూప్రాన్): ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గురువారం సాంఘిక శాస్త్రంలోని ప్రజాస్వామ్యం పాఠ్యాంశం ఆధారంగా ఉపాధ్యాయులు లక్ష్మణ్, రఘుపతి విద్యార్థులకు ఎన్నికల గురించి వివరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు గతంలో నిర్వహించిన బ్యాలెట్ ఓటింగ్ గురించి తెలియజేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకొని పరిపాలన జరుపుకునే విధానం గురించి తెలియజేశారు. సుపరిపాలన కోసం ప్రలోభాలకు లోనుకాకుండా మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్, రాథోడ్, రమ, వాసవి, శారద, శ్రీవాణి, లలిత, చక్రధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సాపూర్ సీఐగా జాన్‌రెడ్డి


ఎస్పీకి మొక్కను అందజేస్తున్న సీఐ

నర్సాపూర్: నర్సాపూర్ సీఐ రంగకృష్ణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో జాన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో నీలకంఠం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచమ్మరాళ్ పాఠశాలను మండల విద్యాధికారి నీలకంఠం గురువారం పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టీ, మధ్యాహ్న భోజనం, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యతమైన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రతీ రోజు విద్యార్థుల హాజరు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట కృష్ణ, కవిత ఉన్నారు.

క్రీడా స్థలం ఆక్రమణ అన్యాయం

- విద్యార్థులు, గ్రామస్తుల నిరసన
- ఎంపీడీఓకు వినతి

వెల్దుర్తి(తూప్రాన్): పాఠశాల క్రీడా స్థలాన్ని కాపాడాలంటూ ఉన్నత పాఠశాల, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గ్రామస్తులు, సీపీఎం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాల క్రీడా ప్రాంగణ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా గ్రంథాలయశాఖకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను రద్దుచేయాలంటూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాల అధీనంలో ఉన్న క్రీడాస్థలానికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన ఇంటి నంబర్‌తో తప్పుడు పత్రాలు సృష్టించడం అన్యాయం అన్నారు. దానిని గిఫ్ట్‌డీడ్ చేసిన సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండానే కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించి పాఠశాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే రద్దుచేసి గ్రంథాలయ భవనాన్ని పాత పంచాయతీ వద్ద నిర్మించాలని, లేనిపక్షంలో విద్యార్థుల తరపున ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కర్రె వెంకటేశం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్‌గౌడ్, సీపీఎం మండల కార్యదర్శి గౌరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, టౌన్ ప్రెసిడెంట్ రాకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

భూమిని స్వాధీనం చేసుకోవాలి..

నర్సాపూర్: మండలంలోని అచ్చంపేటలోని క్రీడా ప్రాంగణం స్థలాన్ని ఓ రైతు ఆక్రమించాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సుమారు 35గుంటల భూమి కేటాయించి ప్రాగంణం ఏర్పాటు చేశారని, క్రీడా ప్రాంగణాన్ని ఆనుకుని వ్యవసాయ భూమి ఉన్న రైతు క్రీడా ప్రాంగణంలో సుమారు పది గుంటల భూమిని ఆక్రమించి పశువుల పాక ఏర్పాటు చేశాడని గ్రామస్తులు వాపోయారు. రైతు ఆక్రమించిన క్రీడా ప్రాంగణం భూమిని స్వాధీనం చేసుకుని మరింత అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. క్రీడా ప్రాంగణం పక్కన ఉన్న రైతు పశువుల పాక వేసిన మాట వాస్తవమేనని పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తాను గుర్తించి ఆ భూమిని ఖాళీ చేయాలని రైతుకు నోటీసు అందచేశానని చెప్పారు.

వివక్షపై చర్యలు తీసుకుంటాం

ఆర్‌ఐ గంగాధర్ గౌడ్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఆర్‌ఐ గంగాధర్ గౌడ్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం కుల వివక్ష, రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల ప్రవేశంలో ఆటంకాలు లాంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పౌరులకు వివక్ష సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులకు తెలియజేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో


మాట్లాడుతున్న ఆర్‌ఐ గంగాధర్ గౌడ్

ఏఎస్‌ఐ జయపాల్ రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, కార్యదర్శి వెంకట నరసింహారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లు భూముల వేలం..

ముందుకు రాని ఔత్సాహికులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎఫ్‌సీఐకి చెల్లించాల్సిన బియ్యం చెల్లించని రైస్‌మిల్ యజమాని భూములను గురువారం వేలం వేసేందుకు అధికారులు గ్రామానికి వెళ్లినప్పటికీ ఔత్సాహికులు ముందుకు రాలేదు. మండల పరిధి రత్నపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న లక్ష్మీనర్సింహ రైస్‌మిల్ యజమాని లింబాద్రిరావు ఎఫ్‌సీఐకి రూ.4 కోట్లు బాకీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాకీ చెల్లించాలని పలుమార్లు ఆయనకు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు రత్నపూర్, కొత్తపేట గ్రామ పరిధిలో ఆయనకు చెందిన పట్టా భూములను గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహించేందుకు సివిల్ సప్లయ్ డీఎం బ్రహ్మారావు,


వేలం నిర్వహిస్తున్న అధికారులు

తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఉప తహసీల్దార్ షఫియుద్దీన్, ఆర్‌ఐ కిషన్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ధర ఎకరాకు రూ.60లక్షలు నిర్ణయించారు. అందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాట నిలిపేశారు. తిరిగి 4న మరోమారు వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన చిట్కుల్ గ్రామంలో గల పత్తికుంట నుంచి పల్లె దవాఖాన ఆవరణలో ఉన్న రక్షితనీటి ట్యాంకు వరకు సుమారు 250 మీటర్ల పైప్‌లైన్ వేసేందుకు సర్వే చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 250మీటర్ల పైప్‌లైన్ వేసేందుకు పంచాయతీ నిధులు సుమారు రూ.4లక్షల వరకు మంజూరు అయ్యాయన్నారు. త్వరలోనే పైప్‌లైన్ పనులు పూర్తిచేసి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.


సర్వే చేస్తున్న అన్వేష్‌రెడ్డి, తిరుపతి

విద్యార్థులు ఆందోళన చెందొద్దు

సీఐ కృష్ణ

తూప్రాన్: పట్టణంలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను సీఐ కృష్ణ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష జరుగుతున్న తీరు, విద్యార్థుల హాజరు వివరాలు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు, నలంద కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పీవీ రమణ, ఇన్‌చార్జి పట్లూరి రవీందర్ సీఐకి వివరించారు.



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న సీఐ కృష్ణ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పెద్దశంకరంపేట(మెదక్)/చేగుంట(తూప్రాన్): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్ష నిర్వహించారు. 175 మంది విద్యార్థులకు గాను 172 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అవినీష్‌రెడ్డి, డీఓ రవికుమార్ తెలిపారు.

చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 178 మంది విద్యార్థులకు 173 మంది పరీక్ష రాయగా 5 మంది గైర్హాజరయ్యారు. మోడల్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 188 మందికి గాను 178 మంది పరీక్ష రాయగా 10 మంది హాజరు కాలేదు. ఎస్‌ఐ బాలరాజు పర్యవేక్షించారు.

ఎంపీఓ సేవలు అభినందనీయం

చిన్నశంకరంపేట(మెదక్): ఎంపీఓ గిరిధర్‌రెడ్డి సేవలు అభినందనీయమని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీఓ గిరిధర్‌రెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సభలో ఆమె మాట్లాడుతూ గిరిధర్‌రెడ్డి గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర నిర్వహించారని ప్రశంసించారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలును ప్రత్యేక బాధ్యతగా తీసుకుని పూర్తిచేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.దామోదర్, తహసీల్దార్ మన్నన్, గ్రామ కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, టీఎన్‌జీఓ తాలూకా అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

విద్యార్థిని అదృశ్యం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన ఓ యువతి బుధవారం ఉదయం నుంచి కనబడడం లేదని పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చాకలి నర్సింలు చిన్న కూతురైన సుమలత రామాయంపేటలోని ఛత్రపతి శివాజీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం 8గంటల ప్రాంతంలో కాలేజీకని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గురువారం వరకు తిరిగి రాలేదని నర్సింలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భూములు కోల్పోతున్నాం.. ఆదుకోవాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు

రామాయంపేట(మెదక్): మెదక్- రామాయంపేట జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రజనీ కుమారి గురువారం ఆయా భూములను పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో విలువైన తమ వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ విలువ ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని కోరారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలేవి?

బీజేపీ నేత సురేశ్

నర్సాపూర్: పట్టణ పరిధిలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని మున్సిపల్ కౌన్సిలర్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని 731, 79 సర్వే నంబర్లలోని కొంత ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేసి తమ వెంచర్‌లో కలిపి ప్లాట్లు చేశారని ఆయన ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమని వాపోయారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు విఫలం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని సురేశ్ కోరారు. అదేవిధంగా మండలంలోని రెడ్డిపల్లి సమీపంలో ఉన్న కాళేశ్వరం కాలువ నుంచి మట్టిని పలువురు వెంచర్ల యజమానులు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. అక్రమార్కులకు అధికారులు సహకరిస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు.

రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన మిషన్ భగీరథ లైన్‌మెన్ పోచయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కదారి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన పోచయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌సీ సంస్థ రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పోచయ్య మృతితో ఆయన భార్య, పిల్లల దిక్కుతోచని స్థితిలో పడ్డారని వాపోయారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ కార్మికులకు ఉద్యోగ భద్రతలేక, వచ్చే జీతం సరిపోక దయనీయ జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ మేనేజర్ జగపతి బాబు మృతుడి అంత్యక్రియలకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి, నర్సింలు, స్వామి, నవీన్ తదితరులు ఉన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

మీడియా ఛైర్మన్‌కు పలువురి శుభాకాంక్షలు

మెదక్: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌రెడ్డికి పలు సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్‌చారి, ప్రధాన కార్యదర్శి ఎ.సంతోష్ కుమార్, దాడుల వ్యతిరేక కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సుమన్, నాయకులు సంగమేశ్వర్, సుధాకర్, నర్సింలు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నిమిషం నిబంధనతో జీవితం బలి

ఏబీవీపీ నాయకుడు శశికాంత్

చేగుంట(తూప్రాన్): ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన పెట్టడం వల్ల ఆదిలాబాద్ జిల్లాలో ఓ విద్యార్థి నిండు జీవితం బలైందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శశికాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిమిషం నిబంధన విధించడంతో శివ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. గ్రామీణ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావడానికి ఆ నిబంధన అడ్డంకిగా ఉందని వాపోయారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ఈ నిబంధన విధిస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగించే నిబంధనలు తొలగించే వరకు పోరాడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ స్థానిక విద్యార్థి నాయకులు నరేష్, వంశీ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఉత్సాహంగా బండ్ల ఊరేగింపు

ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీకొండాపూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బండ్ల ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండ్ల ఊరేగింపును ప్రారంభించారు. ప్రతి ఏటా ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నవీన్, సహకార సంఘం అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ డప్పు కళాకారుడికి పురస్కారం లభించడంపై హర్షం

వెల్దుర్తి(తూప్రాన్): డప్పు కళాకారుడు భాస్కర్‌కు కేంద్ర ప్రభుత్వం ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారానికి ఎంపిక చేయడం అభినందనీయమని ఎంజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ అన్నారు. డప్పు మీద దరువులు వేస్తూ ప్రజల హృదయాలను అలరించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

◆ ఘనంగా బీరప్ప జాతర

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచమ్మరాళ్ గ్రామంలో బీరప్ప జాతర సందర్భంగా దేవాలయం వద్ద గురువారం హోమం నిర్వహించారు. పూజారి మధుసూదనాచార్యులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

◆ ఉచిత వైద్య పరీక్షలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటకు చెందిన బసన్నపల్లి మల్లేశం కూతురు వైష్ణవి జన్మదినం సందర్భంగా దుర్గమ్మ బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎస్‌ఐ రంజిత్ ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైనవారిని ఆసుపత్రికి తరలించి ఉచితంగా నిర్వహిస్తామని డాక్టర్లు తెలిపారు. జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ శ్రీనివాసశర్మ, వైద్యులు సాయికిరణ్, రమ్య, సిబ్బంది, ఎస్‌ఐ-2 బాల్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



◆ హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

చేగుంట(తూప్రాన్): భవానీ రామలింగేశ్వర సహిత హనుమాన్ దేవాలయంలో గురువారం 15వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణం, హోమం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూనరాములు, అయిత పరంజ్యోతి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సంతోష్, రామలింగం తపాల్గొన్నారు.

◆ టీఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సాపూర్: టీఎన్జీఓ సంఘం డైరీ, క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అశోక్‌గౌడ్, సంఘం నియోజకవర్గ యూనిట్ అధ్యక్షుడు శేషాచారి, కార్యదర్శి రాకేష్ తదితరులు డైరీ, క్యాలండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చెన్నయ్య, కృష్ణ, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విజయసంకల్ప యాత్రకు బీజేపీ శ్రేణులు

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్‌లో గురువారం నిర్వహించిన విజయసంకల్ప యాత్రకు బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బైకులు, ఆటోలలో కార్యకర్తలు తరలివెళ్లారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్‌లో పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. శ్రావణ్, కృష్ణ, సంగమేశ్వర్, అనిల్ తదితరులున్నారు.

◆ రేపటి నుంచి మల్లికార్జునస్వామి జాతర

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేటలోని భ్రమరాంబికామల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలను ప్రారంభిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం రుద్రభిషేకం, ఆదివారం గంగాస్నానం, సోమవారం కల్యాణం, మంగళవారం ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ 'పల్స్ పోలియో'కు సహకారం అవసరం

కొల్చారం(నర్సాపూర్): మార్చ్ 3 నుంచి 5వరకు నిర్వహించ తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరి సహకారం అవసరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేశ్ కోరారు. ఎంపీపీ మంజుల అధ్యక్షతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామాల ప్రత్యేక అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 0-5 ఎళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో వేయించేలా అధికారులు ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని ఎంపీపీ ఆదేశించారు. సదస్సులో తహసీల్దార్ గఫార్ మియా, ఎంపీఓ లక్ష్మీనర్సింహులు, ట్రాన్స్‌కో ఏఈ మహమూద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీనర్సమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.